
# మెడికల్ విజన్ 2020

కాన్వెంటు స్కూళ్ళల్లా మెడికల్ కాలేజీలు కూడా పుట్టగొడుగుల్లా మండలానొకొకటి పుట్టుకొచ్చాయి. దీనికితోడు చైనా, రష్యా, నేపాల్‌లో చదివివచ్చిన వేలకు వేలమంది కొత్త డాక్టర్లు డిగ్రీలు తీసుకుని ఊర్లమీద పడ్డారు.


డాక్టర్ ఎన్.వి.రామరాజు

వైద్యం ప్రజల గడపల వద్దకే వచ్చింది. "డాక్టర్ రోగి దగ్గరకే వెళ్ళు" అన్న నార్మన్ బెతూన్ కల నిజమైంది.

ఆ దెబ్బకు జ్వరాలు, జలుబులు, దగ్గులు, విరోచనాల్లాంటి చిన్న చిన్న రుగ్మతలు, అడ్రస్ లేకుండాపోయాయి. ఇక హై బీ.పి., షుగర్, ఆస్మా, కీళ్ళనొప్పుల్లాంటి దీర్ఘకాలిక వ్యాధులకు జెనిటిక్ కౌన్సిలింగ్ చేసి వాటిని పూర్తిగా ఆపేశారు. ఎయిడ్స్‌కి వ్యాక్సిన్ కనిపెట్టారు. జనంలో ఎయిడ్స్ అంటే భయం పోయి పులిరాజుకి ఎయిడ్స్ ఎప్పటికీ రాదంటూ విచ్చలవిడిగా తిరగసాగారు. కాలుష్యం వల్ల దోమలన్నీ చచ్చిపోయి చికున్‌గున్యా, డెంగీ లాంటి దోమల వల్ల వచ్చే జబ్బులు పూర్తిగా కనుమరుగైనయ్.

ఆ దెబ్బతో ఆస్పత్రులన్నీ మూతబడ్డాయి. నర్సింగ్ హోమ్స్, క్లినిక్స్‌లనే బోర్డులు కన్పించడమే లేదు. కార్పొరేట్ హాస్పిటళ్ళన్నీ స్టార్‌హోటళ్ళు, డీమ్డ్ యూనివర్సిటీలు, ఫంక్షన్ హాల్లు అయ్యాయి.

జబ్బులు లేకపోవడంతో మరణాల సంఖ్య తగ్గి దేశంలో జనాభా విపరీతంగా పెరిగిపోయి, చైనా సెన్సస్‌ని దాటిపోయింది. ఇప్పుడు ప్రపంచ జనాభా మొత్తంలో మొదటిస్థానం మనదే. 'ఇకచాలు, పిల్లల్ని కనొద్దని' గవర్నమెంటు చట్టం చేసింది. అందం కాపాడుకోవాలనే అమ్మాయిల పాలిట ఇదొక వరమైంది. అందుకే అందరూ స్ట్రిక్ట్‌గా ఈ రూల్‌ని ఇంప్లిమెంట్ చేస్తున్నారు. ఆ దెబ్బతో గైనకాలజిస్టులకు, పీడియాట్రిషియన్స్‌కు పనిలేక వీడియో గేమ్స్ ఆడుకుంటూ వీడియో ఫోన్‌లో మాట్లాడుతూ కాలక్షేపం చేస్తున్నారు.

గ్లోబలైజేషన్ వలన ఇప్పుడు ప్రభుత్వ ఆధీనంలో రెవిన్యూ, పోలీస్ తప్ప మిగిలిన శాఖలన్నీ ప్రైవేటైజేషన్ అయిపోయినయ్. ఎవరి స్తోమతు, హోదా, హాబీని బట్టి వారు వ్యాపారాలు, వ్యాపకాలు నిర్వహిస్తున్నారు.

మా ఊరికే కాదు, ఈ పరిస్థితి దేశమంతా ఉంది.

డాక్టర్లంతా ఐ.ఎం.ఏ.(ఇండియన్ మెడికల్ అసోసియేషన్) బిల్డింగ్‌లో సాయంత్రం ఆరు గంటలకే సమావేశమయ్యారు. మామూలుగా అయితే పది గంటలు దాటితేగాని రారు.

'పరిస్థితిలా ఉంటే మనమేం చేయాలి?' అన్నదే ఆరోజు ఎజెండా.

మెల్లమెల్లగా ఒక్కొక్కరూ తమతమ అభిప్రాయాలు చెప్పటం మొదలెట్టారు.

ముందుగా ఫ్యాషన్‌గా గడ్డం పెంచుకున్న పిల్లల డాక్టర్ లేచి "వందమందికి తక్కువ లేకుండా పేషెంట్స్‌ను చూసేవాడిని. ఉదయం 9 గంటల నుంచి రాత్రి 12 గంటలదాకా తినడానికి కూడా టైం ఉండేది కాదు. ఇప్పుడు ఒక్క పిల్లోడు వస్తే ఒట్టు" అని చెప్తూ మిగిలిన పీడియాట్రిషన్స్ (పిల్లల డాక్టర్లు)వైపు చూశాడు. "మా పరిస్థితీ అంతే! అసలు ఇంజక్షన్లు ఇవ్వడమే మరిచిపోయాం" అన్నారు బాధగా. "కనుక మనమంతా సైకిల్ స్టోర్స్, వీడియో గేమ్స్, థీమ్ పార్కులు పెట్టుకుంటే పిల్లలతో కొంచెం కాలక్షేపం అవుతుంది" అని చెప్పాడు. ఈ సలహా బాగుందని కొందరన్నారు.

"ఓ.పి. చూడటం, ఆపరేషన్స్, డెలివరీలు చెయ్యడమే కాని వంటాయలు కోయడం కూడా బొత్తిగా మర్చిపోయాం, మరి మేమేం చెయ్యాలి?" అంటూ ఒక జూనియర్ గైనకాలజిస్టు లేచి ప్రశ్నించింది. అంతలో ఒక సీనియర్ గైనకాలజిస్టు లేచి కళ్ళజోడు సవరించుకొని "మనం కూడా ఎవరి అభిమతాలకు తగ్గట్టుగా వారు- లేటెస్ట్ డిజైన్స్ ఉన్న ఏ చీరల షాపో, డైమండ్ షాపో, మేచింగ్ సెంటర్లో, స్లిమ్ కేర్ సెంటర్లో, ఫాస్ట్‌ఫుడ్ సెంటర్లో, బ్యూటీపార్లర్లో నడుపుకోవచ్చు. వీటన్నింటిలో మనకు బాగా టచ్ ఉంది కనుక ఇబ్బందేమీ ఉండదు" అని చెప్పింది.

"రోజుకో 'ఐడియా'లా ఇది బాగుంద"ని లేడీస్ స్పెషలిస్టులందరూ ఒప్పుకున్నారు.

తర్వాత సీనియర్ సర్జన్ లేచి అందరి వంకా పరీక్షగా చూసి ఐ.ఎం.ఏ. (ఇండియన్ మెడికల్ అసోసియేషన్) మెంబర్స్ అంతా హాజరు కావడంతో మరింత ఉత్సాహంగా చెప్పడం మొదలెట్టాడు.

"ఇంత బతుకూ బతికి ఇంటింటికెళ్ళి ఆపరేషన్లు చెయ్యలేం. హెల్త్ వైజ్‌గా దేశం ఎంత అభివృద్ధి చెందినా మనిషి ప్రాథమిక అవసరాలైన తిండి, నీరు, బట్ట, గూడు మాత్రం తప్పవు. కనుక ఈ దిశగా ఎవరి స్థాయిని బట్టి వాళ్ళు వ్యాపారం చేసుకుంటే బాగుంటుంది" అని చెప్పి, కొంచెం పెప్సీకోలా తాగి మరలా చెప్పడం ప్రారంభించాడు.

**కథ**

"కత్తులు, కత్తెర్లతో వృత్తి సాగించే సర్జన్స్ మోడ్రన్ టైలరింగ్ షాపులో, రెడీమేడ్ గార్మెంట్ సెంటర్లో పెట్టుకుంటే బిజినెస్‌తోపాటు కొంత వృత్తిపరమైన సంతృప్తి ఉంటుందని, వంటా వార్పు తెలిసి వెరైటీ డిషెస్ చేయగలవారు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్స్, చైనాఫుడ్ సెంటర్స్ ప్రారంభించవచ్చునని, కంటి డాక్టర్లు డిజిటల్ ఫోటో స్టూడియోనో, వీడియో షూటింగ్ లాంటి పనులు చేసుకోవచ్చుని, చెవి,గొంతు డాక్టర్లు ఆడియో సెంటర్ నడుపుకోవచ్చని, భక్తి ఎక్కువగా ఉన్న బాబా భక్తులు ఏదో ఒక గుడి మెయింటెన్ చేసుకోవచ్చని, ఫ్లాట్స్ బిజినెస్ చేసేవారు ఏ బిల్డర్లో పట్టుకుని సింగపూర్ హౌస్‌లు కట్టి అమ్ముకోవచ్చని చెప్పి కూర్చొన్నారు. ఈ సలహాలు బాగున్నాయని, ఖాళీగా కూర్చొనేకంటే ఏదో ఒక పని చేసుకుంటే మంచిదేనని అందరూ ఒప్పుకున్నారు. డిన్నర్ ముగించి ఇళ్ళకు చేరారు.

** ** **

కొంతకాలం తర్వాత...


పండగ సీజన్ కావడంతో రోడ్లన్నీ జనంతో నిండి ఉన్నాయి. 'ఇళయరాజా సౌండ్ అండ్ మ్యూజిక్ సెంటర్' బిజీగా ఉంది. డి.వి.డిలు, సీడీలు లేటెస్ట్ ఆల్బమ్ హాట్‌కేక్‌లా అమ్ముడవుతున్నాయి. పాత పాటల ఆడియోలు ఉన్న కౌంటర్ పొద్దుట్నుంచి బిజీగా ఉంది. "ఆలం ఆరా" నుంచి "శంకరాభరణం" వరకూ ఆడియో రికార్డ్ చేసి అలసిపోయాను. రాత్రి ఎనిమిది గంటలు కావడంతో రష్ తగ్గింది. మా పిల్లలిద్దరికి షాపు చూసుకొమ్మని చెప్పి బయటపడ్డాను కొంచెం

ఆక్సిజన్ పీల్చుకుందామని. ఇంతకుపూర్వం నేనొక చెవి, గొంతు డాక్టర్ని.

సరాసరి మురళి దగ్గరకు వెళ్ళాను. వాడు పదేళ్ళ ముందు గొప్ప కంటిడాక్టర్. లోన 'త్రీడీ ఫోటోస్' తీస్తున్నాడు. కొంచెం సేపు తరువాత బయటకు వచ్చాడు. "ఏరా ఇంకా ఫోటోస్ తీసే పనేమన్నా ఉందా?" అన్నాను. "ఈ పూటకి నా పనయిపోయింది. ఆకలిగా ఉంది. ఏమన్నా తిందాంపదా" అన్నాడు. మొదట్నుంచీ వీడికి ఆకలెక్కువే హాస్టల్లో కూడా ఇంతే! ఇద్దరం కలిసి నందినీ 'ఫాస్ట్‌ఫుడ్ సెంటర్ అండ్ రూఫ్‌గార్డెన్'కు వెళ్ళాం. గంట వెయిట్ చేసి ఒక సంపంగి మొక్క దగ్గర కూర్చొని వాడొక ఐదు, నేనొక రెండు పిజ్జాలు లాగించాం. జనమంతా వంట చెయ్యడం మానేసి హోటల్ల మీద పడ్డట్టున్నారు. పండగ కదా మన వాళ్ళందరిని పలకరించనట్లుంటుంది. అలా తిరిగిద్దాం అని నందినితో చెప్పి బయటపడ్డాం. నందిని నా శ్రీమతి. పదేళ్ళముందు ఆమె ప్రముఖ సోనాలిజిస్టు. ఇపుడు ఫాస్టు ఫుడ్ సెంటర్ నడుపుతుంది.

రోడ్లన్నీ జనంతో కిటకిటలాడుతున్నాయి. నియోన్‌లైట్స్, ఆకాశ హార్మ్యాలతో ఊరు రూపే మారిపోయింది. అన్నీ మోడ్రన్ కార్స్, లేటెస్ట్ బైక్స్, చూద్దామన్నా ఒక్క సైకిల్ గానీ, స్కూటర్ గానీ కనిపించడం లేదు. ముందుగా అల్ట్రా మోడ్రన్‌గా ఉన్న వర్క్‌షాప్ ముందాగాం. 'కేశవాచారి అండ్ సన్స్ హార్ట్ రిపేరింగ్ సెంటర్' అనే బోర్డు నియోన్‌లైట్స్‌తో వెలుగుతూ కనిపించింది. మేము హాల్లోకి ప్రవేశించగానే అద్దాల్లోంచి పంతులు కనిపించాడు. వర్కర్స్‌కి ఇన్‌స్ట్రక్షన్స్ ఇస్తూ హార్ట్‌కి పాలిష్ పెడుతూ మమ్మల్ని చూసి నవ్వుతూ బయటికొచ్చాడు. "పండగపూట కూడా కొలిమేందిరా? అలా ఊరిమీద తిరిగొద్దాం రా" అన్నాను. "అర్జెంటుగా రిపేర్ చేయాల్సిన హార్ట్స్ ఉన్నాయి. ఈలోపు మీరు తిరిగిరండి. డిన్నర్ ఇక్కడే చేద్దాం" అన్నా డు. కాలంతోబాటు గుండెలు ఇనప గుండెలయినాయి అనుకుంటూ బయటపడ్డాం. అతను పదేళ్ళ ముందు ప్రముఖ గుండె వైద్యనిపుణుడు.


మేము వస్తుంటే 'మీ ఊపిరితిత్తులు పరీక్షించుకోండి- అవసరమైన ఆక్సిజన్ తీసుకోండి' అనే పెద్దబోర్డు కనిపించి లోనికెళ్ళాం. లోన డాక్టర్ కిర్‌పాల్ ఇనహలేషన్ స్పెషలిస్టు వున్నాడు- అక్కడ చాలామంది జనం వెయిటింగ్ రూమ్‌లో కూర్చుని ఉన్నారు. లోపల అద్దాల గదిలో కిర్‌పాల్ రోగులను పరీక్షిస్తున్నాడు. లంగ్ ఫంక్షన్ టెస్ట్‌లు, వైటల్ కెపాసిటీ టెస్టులు చేసి ఎవరికెంత ఆక్సిజన్ అవసరమో ఒక చిట్టీ మీద రాసిస్తుంటే గ్రీన్‌డ్రెసు వేసుకున్న వార్డుబోయ్స్ ఒక్కొక్కరిని ఆక్సిజన్





చాంబర్‌లోకి పంపిస్తున్నాడు. అద్దాల్లోంచి మమ్మల్ని చూసి లోనికి పిలిచాడు కిర్‌పాల్. "ఏందిరా ఇది సంతలాగా జనం? రోజూ ఇంతే నా?" అన్నాను. "ఏం చేద్దాంరా స్వార్థంతో చెట్లన్నీ నరికేశారు జనం. ఫాక్టరీస్, మోటార్ వెహికల్స్ పెరిగిపోయి వాతావరణం కాలుష్యమై, ఆక్సిజన్ తగ్గిపోయింది. మనిషికి తిండి లేకపోయినా కొంతకాలం బతుకుతాడు కాని ఆక్సిజన్ లేకపోతే బతకలేడు కదా! అందుకే వారానికింతని ఆక్సిజన్ తీసుకొని జనం బతుకుతున్నారు. మమ్మల్ని బతికిస్తున్నారు" అన్నాడు హాల్లో ఉన్న జనాన్ని తృప్తిగా చూసుకుంటూ. "పనిలో పనిగా మీరు కూడా చెరొక ఆక్సిజన్ పఫ్ తీసుకోండిరా... అని "బోయ్స్, వీరిద్దరికి చెరొక పఫ్" అన్నాడు. "మత్తు డాక్టర్‌గా అప్పుడు నైట్రస్‌తో, ఇప్పుడు ఆక్సిజన్‌తో జనానికి బాగానే మత్తిస్తున్నావ్, కానియ్‌రా... పాల్..." అని చెప్పి బయటకొచ్చాం. కొంతమంది బాగా డబ్బున్నవాళ్ళు ఏకంగా ఆక్సిజన్ సిలిండర్స్ వీపుకు కట్టుకుతిరుగుతున్నారు. ఆక్సిజన్ తీసుకున్నాక గాల్లో తేలిపోతున్నంత ఆనందంగా ఉంది మాకు. మధ్యతరగతి జనం పండుగలకూ పబ్బాలకూ ఎంతోకొంత ఆక్సిజన్ కొనుక్కొని బతుకుతున్నారు. పదేళ్ళక్రితం కిర్‌పాల్ పెద్ద మత్తు డాక్టర్.

కొంచెం ముందుకు వెళ్ళగానే... అక్కడొక గ్యాస్‌ఫిల్లింగ్ సెంటర్ ఉంది. అంతకుముందక్కడ పెట్రోల్ బంక్ ఉండేది. ఇప్పుడందరూ వెహికిల్స్‌కి సి.ఎస్.జి. గ్యాసే వాడుతున్నారు. వాతావరణ కాలుష్యమని పెట్రోల్ బంకులన్నీ మూతబడ్డాయి.

ఇంకా కొంచెం ముందుకెళ్ళగానే 'ఎల్.ఎం.డ్రింకింగ్ వాటర్' అనే బోర్డు కనిపించింది లోనికెళ్ళాం. ఏ.సి.రూములో కూడా చెమటలు కక్కుతున్నాడు మోహన్‌భాస్కర్. "ఎక్కడకు వెళ్ళావురా రెండు రోజుల్నుంచి పత్తాలేవు. గొంతు తడుపుకోను గుక్కెడు నీళ్ళు కూడా లేవు ఇంట్లో గొడవ చేస్తున్నారు" అన్నాను. "ఏలూరు దగ్గర మావాళ్ళు బోర్ వేస్తుంటే వెళ్ళారా... 5000 అడుగుల దింపినా గ్యాస్ తగులుతుంది కాని వాటర్ రావడం లేదు. చేపలచెరువులతో అంతా ఉప్పుమయమయ్యింది. ఇంకా ప్రయత్నించండని చెప్పి వచ్చేశా... పండుగ కదా జనానికి తలో గ్లాసు వాటర్ పోద్దామని" అన్నాడు చెమట తుడుచుకుంటూ. వాటర్ ప్రాబ్లమ్ మరీ తీవ్రమయింది. మంచినీళ్ళు ఒక కాస్ట్లీ ఎఫైర్ అయిపోయింది. ఎవరింటికైనా వెళ్తే ఎన్ని సీసాలైనా విస్కీ, బీరు పోస్తున్నారు కానీ... మంచినీళ్ళడిగితే శత్రువుల్లా చూస్తున్నారు.



"ఏందిరా ఇది సంతలాగా జనం? రోజూ ఇంతే నా?" అన్నాను. "ఏం చేద్దాంరా స్వార్థంతో చెట్లన్నీ నరికేశారు జనం. ఫాక్టరీస్, మోటార్ వెహికల్స్ పెరిగిపోయి వాతావరణం కాలుష్యమై, ఆక్సిజన్ తగ్గిపోయింది. మనిషికి తిండి లేకపోయినా కొంతకాలం బతుకుతాడు కాని ఆక్సిజన్ లేకపోతే బతకలేడు కదా! అందుకే వారానికింతని ఆక్సిజన్ తీసుకొని జనం బతుకుతున్నారు. మమ్మల్ని బతికిస్తున్నారు"



"నా పనయిపోయిందిరా.. ఎవరికి ఏ ఆర్గన్ కావాలో రాయడమే మన పని. మిగతాదంతా వర్క్‌షాప్‌లో చూసుకుంటారు" అన్నాడు. ఈ పని రోజూ ఉండేదేనని రోడ్డు ట్రాఫిక్ ఏక్సిడెంట్స్ (ఆర్.టి.ఏ.) బాగా పెరిగి మా పని బాగానే ఉందని సంతోషంగా చెప్పాడు. మేము మాట్లాడుకుంటుండగానే ఇంకో వ్యాన్ వచ్చి ఆగింది. వాన్‌లో నుంచి ఏడుపులు, పెడబొబ్బలు వినిపిస్తున్నాయి. ఇంకొక లోడ్ వచ్చినట్టుంది పని చూసుకొమ్మని చెప్పి బయటకొచ్చాం. వాడు అంతకుముందు సిటీలో బాగా పేరున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జెన్.

నదులన్నీ ఎండిపోయాయి. వర్షాలు పడి పుష్కరమైంది. వానంటే ఏమిటో జనం మర్చిపోయారు. స్కూలు పిల్లలకి వానలు, నదుల గురించి తరగతి గదుల్లో సీ.డి.లు వేసి చూపిస్తున్నారు.

ఇదంతా ముందే ఊహించినవారు ఎల్.ఎం.బి. వాటర్ బిజినెస్‌లోకి దిగారు... ఎంతైనా ఇంటెలిజెంట్ కదా... ఎక్కడన్నా జలం ఉందంటే చాలు... బోర్ లారీ తీసుకెళ్ళి నీరు తెచ్చి గ్లాసు ఇంత అని అమ్ముతున్నాడు. కిరపాల్ దగ్గరకెళితే ఆక్సిజన్ పెట్టాడు. "కాస్త గొంతు తడుపురా... దాహంగా ఉంది" అన్నాం. "ఆ ఒక్కటీ అడక్కు" అన్నాడు రావుగోపాలరావు స్టైల్లో! వీడితో లాభం లేదురా అని బయటికొస్తుంటే గ్లాసు నీరు... వందరూపాయలు బోర్డు కనిపించింది.

మెయిన్ రోడ్డులో వస్తుంటే 'జి.ఎన్.రావు టైలర్స్' అనే బోర్డు కన్పించి లోనికెళ్ళాం. సర్‌ర్ అని కత్తెరతో బట్టలు కట్ చేస్తున్నాడు సుబ్బారావు. మోడ్రన్ సూయింగ్ మిషన్స్ చప్పుడు లేకుండా పనిచేస్తున్నాయి. "మీక్కూడా రడీ చెయ్యనా.. టెన్ మినిట్స్‌లోనే.. చెరొక డ్రస్" అన్నాడు కత్తెరను టకటకలాడిస్తూ. "కస్టమర్‌తో బిజీగా ఉన్నావుగా తర్వాత వస్తాం" అని చెప్పి బయటపడ్డాం. అప్పట్లో సుబ్బారావు బిజీ జనరల్ సర్జన్.

ఎదురుగా "గ్రిమ్స్"(జి.ఆర్.ఐ.ఎం.ఎస్) లింబ్ అండ్ ఆర్గాన్ స్టోర్స్' అనే బోర్డు కనిపించింది. లివర్, కిడ్నీ, కాళ్ళు, చేతులు బొమ్మలు వేసి ఉన్నాయి. ఇంతలో ఒకవాన్ ఆ స్టోర్ ముందాగింది. ఆ వాన్‌లో ఇరవై మందికి పైగా కాళ్ళూ, చేతులు విరిగి తలలు పగిలి ఆర్తనాదాలు చేస్తున్నారు. పెద్ద యాక్సిడెంట్ అయినట్టుంది. వ్యాన్ సైరన్‌కి వైట్‌డ్రెస్ వేసుకున్న బాయ్స్ ట్రచ్చర్స్ తీసుకొని బయటికొచ్చి క్షతగాత్రులందరినీ లోనికి తీసుకెళ్ళారు. అక్కడున్న డాక్టర్ గురువారెడ్డి వారిని విడివిడిగా పరీక్షించి నెంబర్ ఒన్ రైటలెగ్, నెంబర్ టు పేషెంట్ లెఫ్ట్ కిడ్నీ, నెంబర్ త్రీ లివర్ అని అలా ఎవరికేది డ్యామేజ్ అయితే విడివిడిగా చీటీ మీద రాసి పేషెంట్స్‌కి అంటిస్తున్నాడు. వారందరిని కొందరు బాయ్స్ వర్క్‌షాప్‌లోకి తీసుకెళ్తున్నారు. మేము అలా కూర్చుని ఉండగానే అప్పటివరకు అక్కడి వాతావరణాన్ని ఆర్తనాదాలతో, పెడబొబ్బలతో ముంచెత్తిన క్షతగాత్రులు నవ్వుతూ నడుచుకుంటూ మాముందు నుంచే వెళ్ళిపోతున్నారు. నాకిదేం అర్థంకాక గురువారెడ్డి వంక చూశాను. "ఏంటిరా ఇదంతా... మాయా...? మంత్రమా...! కాళ్ళు, చేతులు విరిగి, తలలు పగిలి ఏడ్చుకుంటూ వచ్చినవారంతా క్షణాల్లో నవ్వుతూ వెళ్ళిపోతున్నారు" అన్నట్టు.

"ఏం చేద్దాం ఇప్పుడంతా స్పీడ్‌యుగం రా! ఇంతకుముందులాగా ఎముక విరిగితే లోన స్టీల్ రాడ్ వేసి సిమెంట్ కట్టేసి బెడ్‌రెస్ట్‌లు ఇచ్చి పెయిన్ కిల్లర్స్, ఆంటిబయోటిక్స్ మందులు ఇవ్వాల్సిన అవసరం లేదు. లివర్ గాని, కిడ్నీగాని పాడైపోతే చనిపోతారన్న భయం లేదు. ఇప్పుడంతా కంప్యూటర్ యుగం. ఎవరికెలా కావాలన్నా నిమిషంలో పని. "క్లోనింగ్" వల్ల ఇప్పుడు బ్రెయిన్ నుంచి లివర్ దాకా ఏ ఆర్గాన్ కావాలన్నా దొరుకుతుంది" మా ల్యాబ్‌లో అన్నాడు.

"ఏంతాగుతారు? హాటా..కూలా..?" అన్నాడు నవ్వుతూ. "ముందు పేషెంట్స్‌ని చూడు మర్యాదలు తర్వాత" అన్నాను.

"నా పనయిపోయిందిరా.. ఎవరికి ఏ ఆర్గన్ కావాలో రాయడమే మన పని. మిగతాదంతా వర్క్‌షాప్‌లో చూసుకుంటారు" అన్నాడు. ఈ పని రోజూ ఉండేదేనని రోడ్డు ట్రాఫిక్ ఏక్సిడెంట్స్ (ఆర్.టి.ఏ.) బాగా పెరిగి మా పని బాగానే ఉందని సంతోషంగా చెప్పాడు. మేము మాట్లాడుకుంటుండగానే ఇంకో వ్యాన్ వచ్చి ఆగింది. వాన్‌లో నుంచి ఏడుపులు, పెడబొబ్బలు వినిపిస్తున్నాయి. ఇంకొక లోడ్ వచ్చినట్టుంది పని చూసుకొమ్మని చెప్పి బయటకొచ్చాం. వాడు అంతకుముందు సిటీలో బాగా పేరున్న ప్రముఖ ఆర్థోపెడిక్ సర్జెన్.

చౌరస్తా దగ్గరకు రాగానే ఎదురుగా పెద్ద వాల్‌పోస్టర్ కనిపించింది. ఏదో వాల్‌పోస్టర్ అనుకొని మురళి ఆసక్తిగా చూస్తున్నాడు. వాడికి మాయాబజార్, పాతాళభైరవిలాంటి సిన్మాలు సిన్మా హాల్లో చూడాలని కోరిక. రండి.. చూడండి! ఆనందించండి!! దసరా పండుగ సందర్భంగా మన పట్టణంలో జాతీయ, అంతర్జాతీయ ఖ్యాతినొందిన ప్రముఖ కళాకారులచే రాత్రి 10 గంటలకు కళామందిరంలో గొప్ప సంగీత విభావరి (మ్యూజికల్ నైట్) అభినవ సుశీల బిరుదాంకిత, గానకోకిల డాక్టర్ భార్గవిగారి గానకచేరి. టిక్కెట్లు ఆన్‌లైన్‌లో మాత్రమే లభించును. థియేటర్ దగ్గర అమ్మబడవు అని ఉంది.

గమనిక: మిగిలిన కళాకారులందరూ పూర్వాశ్రమంలో డాక్టర్లే!

"గుర్తుపట్టలా? డాక్టర్ భార్గవి మన క్లాస్‌మేటే! అప్పట్లో ప్రాక్టీస్ బాగానే ఉండేది.. పాటలు పాడి డెలివరీలు చేసేదని పెద్దపేరు. సిజేరియన్ సెక్షన్లకు భయపడే లేడీస్ అంతా ఆమె దగ్గరకు వెళ్ళేవారు ఇప్పుడిలా కచేరీలు చేసుకుంటుంది" అన్నాడు మురళి.

"అవును. ఆమె గొంతు వినేగా మన క్లాసులో నలుగురైదుగురు ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వైజాగ్ మెడికల్ కాలేజీకి పారిపోయారు కదా!" అన్నాను.

"ఇప్పుడు బాగానే సాధన చేసి ఉంటుందిలే! లేకపోతే నేషనల్, ఇంటర్నేషనల్ ప్రోగ్రామ్స్ ఎట్లా ఇస్తది! రేపు తప్పకవెళ్దాం" అన్నాడు మురళి.

"సరే!" అన్నాను. ఏమేం పాటలు పాడుతుందో ఊహించుకుంటూ.

"ఏమండీ! పక్కింటి బాబాయిగారు మీకోసం గంట నుంచి వెయిటింగు. వాళ్ళబ్బాయికి మెడికల్ కాలేజిలో సీటుకోసం వెళ్తే ఏకంగా కాలేజీనే పెట్టుకొమ్మని పర్మిషన్ ఇచ్చేశారట- మీరు ప్రిన్సిపాల్‌గా ఉంటారా అని అడగడానికొచ్చారు" అని మా శ్రీమతి నిద్ర లేపేసరికి...నా కల చెదిరిపోయింది. ●

